www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 8 సెప్టెంబరు 2023

5

పశ్చిమ గోదావరి

పెండింగ్ భూహక్కు పత్రాలు పంపిణీ చేయాలి

భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాలను ఈ నెలాఖరు నాటికి పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడ సిసిఎల్ఎ కార్యాలయం నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రీ సర్వేకు సంబంధించిన అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి సమీక్ష చేశారు. కొన్ని జిల్లాల్లో ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న భూ హక్కు పత్రాల్లో వచ్చే వ్యక్తి పేరు, ఊరి పేరు, ఖాతా నెంబరు తదితర వాటిని పరిశీలించి, వాటిలో ఎటువంటి తప్పిదాలు లేకుండా ఈ నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం భూ హక్కు పత్రాలను జనరేట్ చేసి ప్రింటింగ్‌కి పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు.

8 నెలలు ఆగితే సమస్యలన్నీ పరిష్కరిస్తాం

నరసాపురంలో శాశ్వత డంపింగ్‌యార్డు
లేసు పరిశ్రమకు రాయితీలు ఇచ్చి మార్కెట్ సౌకర్యం
టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్



పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి వద్ద గీతకార్మికులతో లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

'మరో 8 నెలలు వేచి ఉండండి, సమస్యలన్నీ పరిష్కరిస్తాను' అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. వైసిపి ప్రజాప్రతినిధులకు అడ్డగోలు దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై లేదని విమర్శించారు. టిడిపి అధికారంలోకి రాగానే నరసాపురంలో శాశ్వత డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి గతంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర నరసాపురం నియోజకవర్గం సీతారామపురం క్యాంపు సైట్ నుంచి గురువారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ప్రారంభమైంది. నర్సాపురం పట్టణంలో యాత్రకు అపూర్వ స్వాగతం లభించింది. మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, శాసనమండలి మాజీ ఛైర్మన్ ఎం.ఎ.షరీఫ్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో లోకేష్‌ను గజమాలతో సత్కరించారు. నర్సాపురం జగన్నాథ ఆలయ సమీపంలో చేనేత కార్మికులు లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చేనేత కార్మికుల కుటుంబ సభ్యులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, చేనేత వస్త్రాలపై 5 శాతం జిఎస్‌టి ఎత్తివేయాలని, జనతా వస్త్రాల పంపిణీ చేపట్టి చేనేత వస్త్రాలను కొనుగోలుచేయాలని, చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయాలని కోరారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అసమర్థ పాలన కారణంగా చేనేతరంగం సంక్షోభంలో కూరుకుపోయిందని విమర్శించారు. జిఎస్‌టి రద్దు చేసేలా కేంద్రంతో మాట్లాడుతామని, కుదరకపోతే రాష్ట్ర ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తొమ్మిదో వార్డు ప్రజలు లోకేష్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. మున్సిపాల్టీ ఏర్పడి 70 ఏళ్లయినా డంపింగ్ యార్డ్ లేదన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరత కారణంగా వైద్యం అందట్లేదని చెప్పారు. లోకేష్ మాట్లాడుతూ చెత్తపై పన్నేసిన జగన్‌కు మౌలిక సదుపాయాల కల్పించడంపై దృష్టి లేదన్నారు. నర్సాపురంలో పేరొందిన లేస్ పరిశ్రమకు రాయితీలిచ్చి, మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. గాంధీ విగ్రహం వద్ద పట్టణ మహిళలు లోకేష్‌ను కలిసి సమస్యలు ఏకరువు పెట్టారు. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా రక్షితనీరు అందించాలని కోరారు. తూర్పుకాపులు సమస్యలపై వినతిపత్రం అందించారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ తూర్పుకాపులను ఒబిసిలుగా గుర్తించే అంశంపై కేంద్రానికి లేఖ రాస్తానని, సర్టిఫికెట్ల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నర్సాపురం రైల్వేరోడ్డులో 30, 31వ వార్డు ప్రజలు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రైల్వే ట్రాక్ దాటి వెళ్లేందుకు స్కూల్ పిల్లలు, రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ట్రాక్ దాటి వెళ్లేందుకు పుట్‌పాత్ బ్రిడ్జి లేదా అండర్ పాస్ రోడ్ ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వేశాఖ అధికారులు, నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుతో మాట్లాడి అండర్ పాస్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని లోకేష్ హామీ ఇచ్చారు. సరిపల్లి భవన నిర్మాణ కార్మికులు లోకేష్‌కు సమస్యలు వివరించారు. సరిపల్లిలో వాటర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడితో లోకేష్ మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ బిల్లు రూ.1200 వచ్చేదని, ప్రస్తుతం రూ.4998 బిల్లు వచ్చిందని చెప్పారు. టిడిపి అధికారంలోకి వచ్చాక విద్యుత్ బిల్లులపై సమీక్షించి ఉపశమనం కలిగిస్తామని లోకేష్ చెప్పారు. అనంతరం పాదయాత్ర చించినాడ బైపాస్ గుండా కలగంపూడి చేరుకుంది.

నరసాపురం టౌన్: సీతారామపురం నుంచి ప్రారంభమైన యువగళం వేములదీవి ఛానల్ మీదుగా పట్టణంలోకి ప్రవేశించింది. అక్కడ రైతులు వేములదీవి ఛానల్ గురించి లోకేష్‌కు వివరించారు. ప్రభుత్వాసుపత్రి, మిషన్ హైస్కూల్ మీదుగా పంజా సెంటర్, మెయిన్ బజార్ మీదుగా హైవేకు చేరింది. ఈ యాత్రలో మాధవనాయుడు, ఎం.ఎ.షరీఫ్, పొత్తూరి రామరాజు, ఎన్ఆర్ఐ కొవ్వలి రామ్మోహన్‌నాయుడు, నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్: మండలంలోని సగం చెరువు వద్ద యువగళం పాదయాత్ర పాలకొల్లు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా కొబ్బరి మొక్కలతో కూడిన గజమాల వేసి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు లోకేష్‌కు స్వాగతం పలికారు. దిగమర్రు వద్ద బేడ బుడగ జంగాలు, పెదమామిడిపల్లి వద్ద గీత కార్మికులు తమ సమస్యలను లోకేష్‌కు విన్నవించారు.

యలమంచిలి: మండలంలోని కాజా గ్రామం వద్ద లోకేష్ పాదయాత్రకు మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నేతలతో లోకేష్ మాట్లాడారు. కలగంపూడి వద్ద ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

రెండేళ్లలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణం

జిఒ నెం.217 రద్దు చేస్తాం: అగ్నికుల క్షత్రియుల ముఖాముఖిలో లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

అగ్నికుల క్షత్రియులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న నారా లోకేష్

టిడిపి అధికారం చేపట్టిన రెండేళ్లలో నరసాపురంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి కృషి చేస్తానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. యువగళం పాదయాత్రలో భాగంగా నర్సాపురం నియోజకవర్గం చిట్టవరంలో గురువారం అగ్నికుల క్షత్రియులతో లోకేష్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నికుల క్షత్రియులు పలు సమస్యలు లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. తీరప్రాంతాల్లో ఉండే తమ పిల్లలను చదివించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. తమకు ఎటువంటి రాజకీయ అవకాశాలూ లేవని, ఎంఎల్ఎ, ఎంఎల్‌సిలుగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మినీ హార్బర్ నిర్మించాలని, అంతర్వేది ఆలయ ట్రస్టు, వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ ట్రస్టుల్లో అవకాశం కల్పించాలన్నారు. దీనిపై లోకేష్ మాట్లాడుతూ జగన్ నాలుగేళ్ల పాలనలో ఒక్క బోటూ ఇవ్వలేదని, పెట్రోల్, డీజిల్ సబ్సిడీలు లేవని విమర్శించారు. చెరువులను పెత్తందారులకు అప్పజెప్పేందుకు తీసుకొచ్చిన జిఒ 217ను తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రద్దు చేస్తామన్నారు. మెరుగైన పనిముట్లు అందిస్తామన్నారు. మత్స్యకారులను ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. బటన్ సంక్షేమం కాకుండా సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా పరుగులు పెట్టిస్తామని చెప్పారు. టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో 35 వేల మంది అగ్నికుల క్షత్రియులు ఉన్నారని, వీరంతా పేదరికంలో ఉన్నారన్నారు. సమావేశంలో మాజీమంత్రి కొల్లు రవీంద్ర, అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం కన్వీనర్ కొప్పాడ రవి పాల్గొన్నారు.

పాదయాత్రను అడ్డుకోవాలనుకోవడం సిగ్గుచేటు

ఉండి మాజీ ఎంఎల్ఎ శివ

ప్రజాశక్తి - ఉండి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ అడ్డుకోవాలనుకోవడం సిగ్గుచేటని ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు విమర్శించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోకేష్ పాదయాత్రకు వస్తున్న స్పందన చూసి తట్టుకోలేక వైసిపి నాయకులు ఇటువంటి ఘటనలకు పాల్పడ్డారని, ఇది సమంజసం కాదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వైసిపి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

తణుకు: నారా లోకేష్ యువగళం పాదయాత్రను ఎవరూ అడ్డుకోలేరని మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ స్పష్టం చేశారు. గురువారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ వైసిపి కవ్వింపు చర్యలను ఖండించారు. చంద్రబాబు, లోకేష్ గురించి మాట్లాడే అర్హత మంత్రి కారుమూరికి లేదన్నారు. నియోజవర్గంలో రైతులను ఏవిధంగా అవమానించారో ప్రజలు గమనిస్తున్నారన్నారు. భీమవరం ఘటనకు పోలీసుల వైఫల్యమే కారణమన్నారు.

యువగళం వాలంటీర్లకు రిమాండ్

మిగిలిన టిడిపి నేతలను త్వరలో అరెస్టు చేస్తాం: భీమవరం వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తాడేరు టౌన్‌షిప్ వద్ద వైసిపి, టిడిపి పరస్పర ఘర్షణకు సంబంధించి పోలీసులు అరెస్టు చేసిన 39 మంది యువగళం వాలంటీర్లకు జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారని భీమవరం వన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి వీరిని రెండో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, దీంతో వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించామని చెప్పారు. కేసులో ఉన్న మిగిలిన టిడిపి నేతలను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు.

లోకేష్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

టిడిపి ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రపై తాడేరు టౌన్‌షిప్ వద్ద దాడి చేసిన వైసిపి నాయకులను వెంటనే అరెస్టు చేయాలని టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి డిమాండ్ చేశారు. గురువారం భీమవరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద కొద్దిసేపు టిడిపి నేతలు ఆందోళన నిర్వహించారు. అనంతరం సిఐ అడబాల శ్రీనివాసులును కలిసి లోకేష్‌పై దాడికి పాల్పడిన వారిని వదిలి టిడిపి నేతలు, యువగళం వాలంటీర్లపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం అన్యాయమని పార్థసారధి అన్నారు. టిడిపి నేతలు, పోలీసులపై దాడి చేసిన వైసిపి వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నీలతి రమేష్, నాయకులు ఎద్దు ఏసుపాదం, ఎమ్‌డి.నౌషద్, గంటా త్రిమూర్తులు, పంతం వెంకటసతీష్, చెల్లబోయిన గోవింద్ పాల్గొన్నారు.

ఉండి మండలం చినపుల్లేరులో పసర్లతో నిండిన తాగునీటి చెరువు

కలుషిత నీరే దిక్కు..!

ఆక్వాతో కలుషితమైన నీటి వనరులు - కొనుగోలు చేస్తే తప్ప దాహం తీరని దుస్థితి
ప్రకటనలకే పరిమితమైన 'వాటర్‌గ్రిడ్' - రోగాల బారిన జనం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ తాగునీటి కోసం జనం అత్యంత దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డెల్టాలోని గ్రామాల్లో తాగేందుకు గుక్కెడు నీరు లేకుండాపోయింది. తాగునీటి చెరువులన్నీ పసర్లతో నిండి తాగేందుకు వీల్లేని దుస్థితి నెలకొంది. దీంతో జనం తాగునీరు కొనుగోలు చేస్తే తప్ప గొంతు తడవని పరిస్థితి ఏర్పడింది. ఆక్వా సాగుతో తాగునీటి వనరులన్నీ పూర్తిగా కలుషితమైపోయాయి. ఆక్వా చెరువుల్లో పురుగుమందులు, రకరకాల రసాయనాలు వాడిన నీటిని పంట కాలువల్లోకి నేరుగా విడిచిపెట్టేస్తున్నారు. ఆ నీటినే పంచాయతీ అధికారులు తాగునీటి చెరువుల్లో నింపుతున్నారు. ఆ నీరు తాగేందుకు వీల్లేకపోవడంతో జనం తాగునీటిని కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి కొనసాగుతోంది. రెండు జిల్లాల్లోనూ దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. దశాబ్దకాలంగా తాగునీటి కోసం రెండు జిల్లాల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. డెల్టా ప్రాంతంలోని నిడమర్రు, ఉండి, కాళ్ల, పాలకోడేరు వంటి అనేక మండలాల్లో తాగునీటి కోసం ప్రజలు నానావస్థలు పడుతున్నారు. 2014 ఎన్నికల్లో తాగునీటి అంశమే జిల్లాలో ప్రధాన ఎజెండాగా సాగింది. తాము అధికారంలోకి వస్తే 20 లీటర్ల నీటిని ఉచితంగా ఇస్తామని, ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ద్వారా వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని టిడిపి హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఉండి, ద్వారకాతిరుమల వంటి ఒకటి, రెండు చోట్ల మాత్రమే వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. అక్కడ కూడా సొమ్ము వెచ్చించి జనం తాగునీరు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఉచిత తాగునీటి హామీ ఎక్కడా అమలు కాలేదు. 2019 సాధారణ ఎన్నికల్లో మరోసారి తాగునీటి అంశం తెరపైకి వచ్చింది. వైసిపి అధ్యక్షుడు జగన్ జిల్లాలో పాదయాత్ర చేస్తూ తాగునీటిని బాటిళ్లలో చూపుతూ ఈ నీటిని మనుషులు తాగుతారా అంటూ అప్పటి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే వాటర్‌గ్రిడ్ ఏర్పాటు చేసి గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీటిని ప్రతి గ్రామానికీ అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చి నాలుగేళ్లయినా ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. ఇప్పటికీ జనం కలుషిత నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొంది. తాగునీటి కొనుగోలు కోసం రోజుకు కనీసంగా రూ.20 వెచ్చించాల్సి వస్తోంది. నెలకు రూ.600కుపైగా తాగునీటికే సామాన్య ప్రజానీకం ఖర్చు చేస్తున్నారు. విచ్చలవిడిగా ఆక్వా చెరువులకు అనుమతులిచ్చిన ప్రభుత్వం, తాగునీరు అందించడంలో ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. ప్రభుత్వాలు మారడం తప్ప జనాలకు దాహం తీరే పరిస్థితి మాత్రం లేకుండాపోయింది. డెల్టాలో ఏ గ్రామానికి వెళ్లినా తాగునీటి చెరువుల ద్వారా సరఫరా చేసే నీరు వాడకానికి తప్ప తాగేందుకు వీల్లేని పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాల్లో వాడకానికి సైతం పనికిరాని పరిస్థితి ఉందంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

కాగితాలకే పరిమితమైన వాటర్‌గ్రిడ్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజలకు గోదావరి నుంచి తాగునీరు అందించేందుకు రూ.3200 కోట్లతో వాటర్‌గ్రిడ్ పథకం ఏర్పాటు చేయనున్నట్లు వైసిపి ప్రభుత్వం మొదట్లో ఊదరగొట్టింది. కొద్దికాలం తర్వాత వాటర్‌గ్రిడ్ పథకాన్ని డెల్టాకు మాత్రమే పరిమితం చేస్తున్నట్లు ప్రకటించి రూ.1400 కోట్లకు అంచనా వ్యయాన్ని కుదించారు. ఇది జరిగి ఏళ్లు గడిచిపోయాయి. ఇప్పటి వరకూ వాటర్‌గ్రిడ్ పథకానికి సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. సర్వే పూర్తయిందంటూ మాటలు చెప్పడం తప్ప చేతలు మాత్రం లేకుండాపోయాయి. గత ఎన్నికల్లో వైసిపి జిల్లా ప్రజలకు ఇచ్చిన ప్రధానమైన హామీల్లో వాటర్‌గ్రిడ్ ఒకటి. ఇప్పటి వరకూ ఆ హామీ కార్యాచరణకు నోచుకోకపోవడంతో జిల్లావాసులు దాహార్తితో అల్లాడుతున్నారు. తాగునీటి కారణంగా డెల్టా ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. కొంతకాలంగా డెల్టాలో కేన్సర్, కిడ్నీ సమస్యలు పెద్దఎత్తున పెరుగుతున్నాయి. సురక్షిత తాగునీటి కోసం ప్రజల ఎదురుచూపులు ఎప్పటికి ఫలిస్తాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

రెల్లి కాలనీలో ప్రత్యేక వైద్యశిబిరం

ప్రజాశక్తి కథనంపై స్పందించిన వైద్యాధికారులు

ప్రజాశక్తి - వీరవాసరం

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి సత్యనారాయణరాజు

వీరవాసరం రెల్లి కాలనీలో ప్రభుత్వ వైద్యాధికారులు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అంటువ్యాధులు వ్యాపించకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. వీరవాసరం రెల్లి కాలనీలో డెంగీ కలకలం శీర్షికన ప్రజాశక్తిలో ఈ నెల ఆరో తేదీన ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. పిహెచ్‌సి వైద్యులు సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ప్రస్తుతం కాలనీ వాసులకు ఎటువంటి అనారోగ్య పరిస్థితులు లేవన్నారు. పరిసరాల్లో దోమల నిర్మూలనకు అవసరమైన రసాయనాలు పిచికారీ చేసి బ్లీచింగ్ చల్లారు. ఈ వైద్య శిబిరంలో ఎఎంఒ పి.శ్రీనివాసరావు, ఎస్‌విఒ ఆర్.భాస్కరావు, సిహెచ్ఒ దేవదాసు, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకాశం చౌక్‌లో టంగుటూరు విగ్రహం ఏర్పాటుకు కృషి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

మోషేన్‌రాజుకు వినతిపత్రం విగ్రహ కమిటీ నాయకులు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రకాశం చౌక్ నామకరణం చేసి ప్రకాశం పంతులు విగ్రహం లేకపోవడం శోచనీయమని, ఆ ప్రాంతంలో విగ్రహాన్ని నెలకొల్పేందుకు అందరి సహకారంతో కృషి చేస్తానని శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ప్రకాశం చౌక్‌లో విగ్రహాన్ని నెలకొల్పాలని విగ్రహ కమిటీ సభ్యులు గురువారం మోషేన్‌రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలన్నారు. ఈ విషయంపై విగ్రహ కమిటీ సభ్యులు ఎప్పటినుంచో కోరుతున్నారని, ప్రకాశం పంతులు విగ్రహ స్థాపనకు సంపూర్ణంగా సహకరిస్తానని చెప్పారు. వినతిపత్రం అందించిన కమిటీ సభ్యులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, నందమూరి రాజేష్, భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ దీనికి సంబంధించి ఎంతోమంది దాతలు సిద్ధంగా ఉన్నారని, 25 ఏళ్లుగా విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులను కోరామని తెలిపారు. త్వరలోనే విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. వాసర్ల ముత్యాలరావు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆడుదాం ఆంధ్రాకు ఈ నెల 30వ తేదీ లోపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై జెసి అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయిర్ట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికి తీయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆటల పోటీలను నిర్వహిస్తుందన్నారు. జిల్లాలో 535 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీల నిర్వహణకు ఈ నెల 30వ తేదీ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. క్రీడాకారుల సామగ్రి భద్రపరిచేందుకు మండల, జిల్లా స్థాయిలో స్టాకు పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. 15 ఏళ్లు దాటిన గ్రామీణ యువతీ, యువకులతో పాటు, ఉన్నత పాఠశాలలో పదో తరగతి, ఆపై జూనియర్ కాలేజీల విద్యార్థులు పోటీల్లో పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కబాడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగా, టెన్నికాయిట్, నడక, పరుగు పందెం, జాగింగ్, లెమన్ స్పూన్ పందేలు అదనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అక్టోబర్ రెండో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాలు, పదో తేదీ నుంచి 21 వరకు మండల స్థాయి, 22వ తేదీ నుంచి 27 వరకు నియోజవర్గ స్థాయి, 28 తేదీ నుంచి నవంబర్ 3 వరకు జిల్లా స్థాయి, నవంబర్ నాలుగో తేదీ నుంచి 8వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఉభయ గోదావరి జిల్లాల స్పోర్ట్స్ అథారిటీ, సెట్‌వెల్ సిఇఒ ఎండిహెచ్ మెహర్‌రాజ్, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ట్రైబల్ అధికారి డి.పుష్పరాణి, పురపాలక సంఘం కమిషనర్ ఎం.శ్యామల, రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవికుమార్ పాల్గొన్నారు.

సత్యవతి మృతి తీరనిలోటు

సంతాప సభలో కుటుంబ సభ్యులు, నేతలు

ప్రజాశక్తి - ఆచంట

సత్యవతి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన కీర్తిశేషులు చిలుకూరి సత్యవతి మరణం తమకు తీరని లోటని ఆమె కుమార్తెలు అట్లూరి రాణిసత్యసునీత, కట్టి కుసుమకుమారి అన్నారు. ఆచంట గ్రామానికి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్, స్మెక్ వ్యవస్థాపకులు, మృత్యుంజయ కోపరేటివ్ సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు, డాక్టర్ చిలుకూరి సుబ్బారావు భార్య చిలుకూరి సత్యవతి సంతాప సభ ఆచంట మృత్యుంజయ కోపరేటివ్ సొసైటీ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించారు. ముందుగా చిలుకూరి సత్యవతి చిత్రపటానికి కుటుంబ సభ్యులతో పాటు సిపిఎం నాయకులు, బంధువులు, శ్రేయోభిలాషులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె ఇరువురు కుమార్తెలు మాట్లాడుతూ తమను ఎంతగానో ఆదరిస్తూ అమూల్యమైన సలహాలు ఇస్తూ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తూ తమ నుంచి దూరమైనా తమ మనసులోనే అమ్మ ప్రేమ ఇంకా కదలాడుతుందని కన్నీరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు అట్లూరి రామా శేషగిరి, చిలుకూరి రమాకృష్ణవేణి, వైట్ల శ్రీను, మన్నే రామలింగేశ్వరరావు, నెక్కంటి వేణుగోపాలకృష్ణ, నెక్కంటి కృష్ణ, భరద్వాజ, సిపిఎం నాయకులు వద్దిపర్తి అంజిబాబు, పి.మోహన్‌రావు, తలుపూరి బుల్లబ్బాయి, తోటపల్లి సత్యనారాయణ, వద్దిపర్తి శ్రీను, నక్క ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను అమలు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు డిమాండ్ చేశారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో భీమవరం డివిజన్ ప్రాంతీయ సమావేశం డివిజన్ సమన్వయకర్త సిహెచ్.పట్టభిరామయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా గోపీమూర్తి, జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒపిఎస్‌ను అమలు చేయకుండా జిపిఎస్‌ను అమలు చేస్తామని ప్రభుత్వం గారడీ చేస్తుందన్నారు. సిపిఎస్ రద్దు చేసి వెంటనే ఒపిఎస్ అమలు చేయాలని, లేకపోతే రానున్న కాలంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం జిఒ 117 తీసుకొచ్చి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. జిఒ నెంబర్ 117ను రద్దు చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కెసిహెచ్.సాయిరాం, జి.రామకృష్ణ ప్రసాద్, కెఎస్.రామకృష్ణ ప్రసాద్, సిహెచ్.కుమార్ బాబ్జి, డి.ఏసుబాబు, రాష్ట్ర కౌన్సిలర్ జివి.రామానుజరావు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్కిప్పింగ్ పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

స్థానిక గురుకుల విద్యాలయంలో పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు బుధవారం స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జూనియర్స్, సీనియర్స్ విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తామని పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమర్తి రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, మాజీ ప్రెసిడెంట్లు మద్దాల వాసు, చందక రాము, కటారి నాగేంద్ర, రోటరీ సభ్యులు, కనూరి ప్రభాకర్, పోతాబత్తుల సత్యనారాయణ, గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ మహేంద్ర పాల్గొన్నారు.

మాజీ ఎంపిపి మల్లికార్జునరావుకు సతీవియోగం

ప్రజాశక్తి - కాళ్ల

నాగమణి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి

కాళ్ల మాజీ ఎంపిపి కంచల వెంకట మల్లికార్జునరావుకు సతీ వియోగం కలిగింది. ఆయన సతీమణి బొండాద మాజీ సర్పంచి నాగమణి(59) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆమె మృతితో మల్లికార్జునరావు నివాసంలో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విచ్చేసి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లికార్జునరావుకు టిటిడి బోర్డు మాజీ సభ్యులు గోకరాజు రామరాజు, వైసిపి నాయకులు గాదిరాజు సుబ్బరాజు, మన్నే నాగరాజు, అభిరచి కాశీరాజు, టిడిపి నాయకులు తోట ఫణిబాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 2013లో బిసి మహిళకు రిజర్వు కావడంతో నాగమణి గ్రామ సర్పంచిగా పోటీ చేసి రెండు ఓట్ల తేడాతో ఓడిపోయారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించలేదని కోర్టును ఆశ్రయించారు. మూడేళ్ల తర్వాత హైకోర్టు నుంచి తీర్పు రావడంతో పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించగా 12 ఓట్లతో గెలుపొందినట్లు ప్రకటించారు. దీంతో సర్పంచిగా రెండేళ్ల పాటు పని చేశారు. ఆమె పదవి కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆమె మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

కొత్తగా 20 మందికి పింఛన్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పింఛన్లు అందిస్తున్న సర్పంచి ప్రియాంక

పార్టీ, కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ పెన్షన్ అందించడమే సిఎం జగన్ లక్ష్యమని పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక అన్నారు. పంచాయతీ పరిధిలోని నూతనంగా అర్హత పొందిన పెన్షన్ దారులకు గురువారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, ఎంపిటిసి సభ్యులు సిహెచ్.మంగాదేవి, వార్డు సభ్యులు, వైసిపి గ్రామ కన్వీనర్ దొంగ బేబి, నాయకులు నరసింహమూర్తి, తాడిపర్తి ప్రసన్నకుమార్, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన జీవిత బీమా వారోత్సవాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జీవిత బీమా వారోత్సవాల ముగింపు సభ గురువారం స్థానిక ఎల్ఐసి కార్యాలయంలో నిర్వహించారు. బ్రాంచి సీనియర్ మేనేజర్ ఎన్.శ్రీరామ్ మాట్లాడుతూ 67 వసంతాల మహా ప్రస్థానంలో ఎల్ఐసి ఎన్నో విజయాల మైలురాళ్లు అధిగమించి బీమా మార్కెట్ రంగంలో నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కె.బాబును ఎల్ఐసి విశ్రాంత ఉద్యోగులు సన్మానించారు. విద్యార్థులకు, ఉద్యోగులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం గారికిపాటి బాపయ్య శర్మ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎల్ఐసి డివిజనల్ మేనేజర్ జె.కామేశ్వరరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ వైవి.రావు, ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

ఓర్వలేకే వైసిపి దిగజారుడు రాజకీయం

యువగళం పరిశీలకులు పెందుర్తి శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకోడేరు

పార్టీ నాయకులతో పెందుర్తి శ్రీనివాస్

యువగళం పాద యాత్ర, చంద్రబాబు పర్యటనలు ప్రజాదరణతో ముందుకు సాగుతున్నాయని, ఇది ఓర్వలేకే వైసిపి దిగజారుడు రాజకీయం చేస్తుందని యువగళం పాదయాత్ర పరిశీలకులు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ విమర్శించారు. యువగళం పాదయాత్ర జనబలంతో ముందుకు సాగుతుందని, దీనిని ఎలాగైనా అడ్డుకోవాలని వైసిపి నాయకులు కుట్ర పన్నుతున్నారన్నారు. పాలకోడేరు మండలంలో పర్యటించిన శ్రీనివాస్ గొల్లలకోడేరులో టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. పశ్చిమ గోదావరి జిల్లా గౌరవ మర్యాదలకు ప్రతీక అని, అటువంటి ప్రాంతాల్లో ముఖ్యమైనవి ఉండి, భీమవరం నియోజకవర్గాలు అన్నారు. ఇక్కడ వైసిపి కవ్వింపు చర్యలతో యువగళం పాదయాత్రపై దాడికి పాల్పడడం అత్యంత దుర్మార్గమన్నారు. జగన్ పాలనతో ప్రజలు విసుగు చెందారన్నారు. రానున్నది టిడిపి ప్రభంజనమేనన్నారు. చంద్రబాబు, లోకేష్‌లపై మంత్రి కొట్టు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలు హాస్యస్పందంగా ఉన్నాయన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి!

ప్రజాశక్తి - ఆకివీడు

అప్పలనాయుడు (ఫైల్)

మండల కేంద్రంమైన ఆకివీడు పట్టణం నుంచి వైభవరం వెళ్లే రోడ్డులో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో రైస్ మిల్లు కార్మికుడు, సిఐటియు సభ్యుడు పైలా చినఅప్పల నాయుడు మృతి చెందాడు. మృతుడు 14వ వార్డు మారుబోయిన సావిత్రమ్మ రోడ్డులో నివాసం ఉంటు న్నాడు. బుధవారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అప్పలనాయుడు మృతి చెందాడని, మరో వ్యక్తి ఆచూకీ తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగబాబు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అప్పలనాయుడిని హత్య కావచ్చుమోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న తర్వాత కొంతసేపు ఇద్దరు వాదోపవాదాలు చేసుకున్నారని, అనంతరం కొంతసేపటికి చిన అప్పలనాయుడు మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు.

సిపిఎం, సిఐటియు నాయకుల పరామర్శ

మృతుని కుటుంబ సభ్యులను పిపిఎం, సిఐటియు నాయకులు పరామర్శించారు. ప్రమాదం చోటు చేసుకున్న ప్రాంతాన్ని పరిశీలించి పూర్తిస్థాయిలో నిజానిజాలు నిగ్గు తేల్చాలని పోలీసులను కోరారు. బాధిత కుటుంబాన్ని కె.తవిటినాయుడు, డోకల రవి, గేదెల ధనుష్, బివి.వర్మ, కె.శంకర్, పెంకి అప్పారావు పరామర్శించారు. మృతుడి భార్య రమణకు తమ సానుభూతి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. మండలంలోని దిగమర్రు బైపాస్ రోడ్డు చెక్‌పోస్టు సమీపంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం పాలకొల్లు సివిల్‌సప్లై డిటి సత్యనారాయణ, మొగల్తూరు డిప్యూటీ తహశీల్దార్ నరేష్‌కుమార్ పట్టుకున్నారు. మొత్తం 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.3.75 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పాలకొల్లు ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద భద్రపరిచారు. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన బియ్యం యజమాని గొట్టాపు రమేష్‌బాబుపై, లారీ డ్రైవర్ కృష్ణపై 6ఎ కేసు నమోదు చేశామని డివిజనల్ సివిల్ సప్లై అధికారి రవిశంకర్ తెలిపారు. ఈ దాడులో అటెండర్లు జి.వీరభద్రపరమేశ్వరరావు, ఉంగరాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గజానికో గుంత.. అడుగేసేందుకు తంటా

గోతులమయంగా కాళ్ల-కోలనపల్లి రహదారి

ప్రజలు, వాహనదారుల ఇబ్బందులు

వర్షం వస్తే అవస్థలు వర్ణనాతీతం

ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారులు

గోతుల్లో వర్షపు నీరు నిలిచి అధ్వానంగా ఉన్న రహదారి

ప్రజాశక్తి - కాళ్ల

రహదారులు అభివృద్ధికి పట్టుకొమ్మలు అంటారు.. అలాంటి రోడ్లు పూర్తిగా పాడైపోయ్యాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆయువు పట్టులాంటి రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసినా... అడుగేస్తే మడుగే అనేంతలా పరిస్థితి ఉంది. అసలక్కడ రోడ్డు ఉందా అనిపించే దారులు లెక్కలేనన్ని..! రోడ్ల నిర్మాణం, మరమ్మతులపై పాలకులు ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిశాయి. గతంలో రోడ్ల మరమ్మతులకు వర్షాలు అడ్డుగా ఉన్నాయని చెప్పుకొచ్చిన ప్రభుత్వం.. ఇప్పుడు మళ్లీ వర్షాకాలం ముంగిట బాగు చేయడానికి ఆదేశాలిచ్చింది. ఇదంతా చూస్తే.. రోడ్డు కష్టాలు కొనసాగక తప్పవని ప్రజలు నైరాశ్యంలో మునిగిపోయారు. ఆర్థికంగానే కాకుండా ఆరోగ్యపరంగానూ పల్లె జీవితాలను అస్తవ్యస్తం చేస్తున్న పల్లె రహదారుల్లో అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది.

గోతుల దారిలో వాహనదారుల అవస్థలు

కాళ్ల - కోలనపల్లి మార్గం గుండా ప్రతిరోజు పదుల సంఖ్యలో పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆకివీడు వెళ్లేందుకు ఈ మార్గం ప్రధానమైనది. రోడ్డు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. గోతులమయంగా మారి ప్రజలకు నరకం చూపిస్తున్నాయి. గత ప్రభుత్వం ప్రారంభించిన రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేసి మూడేళ్లు గడుస్తున్నా.. ఇంతవరకూ అతీగతీ లేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్డులో అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. ఈ మార్గం గుండా పదుల సంఖ్యలో గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలంలో వారు పడే బాధలు వర్ణనాతీతం. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహన చోదకులు, ప్రయాణికులు అనేక అవస్థలు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. ఈ సమయంలో వారు పడే బాధలు వర్ణనాతీతం. స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

కొనకంచి సూర్యనారాయణమూర్తి, కోలనపల్లి సర్పంచి

రహదారులు పాడయ్యాయి. రోడ్డు పూర్తిగా గోతులమయంగా మారింది. కనీసం రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా పోయింది. రాత్రిపూట ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కోలనపల్లి రోడ్డును అభివృద్ధి చేయాలని మండల పరిషత్ సమావేశంలో ప్రస్తావించాను. స్థానిక ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి.

ఆకివీడులో త్వరలో సినిమా షూటింగ్

ప్రజాశక్తి - ఆకివీడు

త్వరలో ఆకివీడు, భీమవరం పరిసర ప్రాంతాల్లో "అధరం-మధురం" అనే పేరుతో తెలుగు సినిమా షూటింగ్ చేయనున్నట్లు కన్నడ సినీ దర్శకులు స్మైల్ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన ప్రముఖ తెలుగు సినీ కథా రచయిత, దర్శకుడు పువ్వాడ ఉదయభాస్కర్, స్థానిక ప్రముఖ న్యాయవాది పువ్వాడ రాజా అమర్నాథ్‌లతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. తనకు తెలుగు, కన్నడలో ఎన్నో సినిమాల్లో సహదర్శకుడుగా ఉదయ్‌భాస్కర్ అవకాశం కల్పించారని చెప్పారు. ప్రస్తుతం భాస్కర్ సలహాలు సూచనలతో ఈ ప్రాంతంలోనే జనవరి నెల నుంచి సినిమా చిత్రీకరణ ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటివరకు తాను ఐదు సినిమాలు కన్నడలో తీశానని, తెలుగులో ఇదే మొదటి సినిమా అని తెలిపారు. సాంకేతిక నిపుణుల, నటీనటులు ఎంపిక జరుగుతోందన్నారు.

త్వరలో శంకర విజయం ప్రారంభం

తాను త్వరలో భారీస్థాయిలో 150 ఎపిసోడ్స్ పైగానే ప్రణాళికతో శంకర విజయం టీవీ సీరియల్ నిర్మించనున్నట్లు ప్రముఖ చలనచిత్ర సీని నంది అవార్డు గ్రహీత దర్శకుడు పువ్వాడ ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఇప్పటికే ఈ సీరియల్ నిర్మాణం ప్రారంభమైందని త్వరలోనే పూర్తి వివరాలు ప్రకటిస్తామని తెలిపారు.

దళితులు బలి పశువులు కావొద్దు

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి, టిడిపిల రాజకీయ విద్వేష క్రీడల్లో దళితప్రజలు బలి పశువులు కావొద్దని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. జిల్లాలో గత రెండు రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలపై గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా కొన్ని అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. వైసిపి, టిడిపిలు రాజకీయ విభేదాల్లో వారి వైఖరులను నిలబెట్టుకోవడం కోసం ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఈ క్రమంలో దళితులు బలిపశువులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దళితులను కేవలం జెండాలు మోయడానికి, ప్రచారంలో తిరగడానికి, అనుచరులుగా ఉండటానికి ఉపయోగించుకుంటున్నారన్నారు. ఇరు పార్టీల రాజకీయ విభేదాల వల్ల దాడుల్లో క్షతగాత్రులుగా మారి కుటుంబాలకు తీరని దు:ఖాన్ని మిగిల్చేది దళితులే అన్నారు. వైసిపి, టిడిపిలు దళితులను రెచ్చగొట్టి వారు మాత్రం అధికారాలను సాధిస్తున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఇచ్చిన హక్కులు అధికార, ప్రతిపక్ష పార్టీల జెండాలు మోయడానికి, వారిని రాజకీయ అధికార పల్లకిలో ఊరేగించడానికి కాదని గుర్తించాలన్నారు. రాజకీయాలను, నైతిక విలువలను వైసిపి, టిడిపిలు దిగజార్చుతున్నారని విమర్శించారు. ప్రజాప్రతినిధులు ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఆచంట

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ఆచంట మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిల్లే లావణ్య అన్నారు. మండలంలోని కరుగోరిమిల్లి పంచాయతీ కాలనీ కొత్త హరిజనపేటలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రహదారికి ఆమె గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ముత్యాల నాగేశ్వరరావు, సలాది రంగారావు, ముత్యాల జగ్గారావు, చీకరమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

నూరు శాతం క్రాస్ వెరిఫికేషన్ చేయాలి

కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

తొలగించిన ప్రతి ఓటు డాక్యుమెంటును నూరు శాతం క్రాస్ వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నియోజకవర్గాల ప్రత్యేక అధికారులతో గురువారం సమావేశమై తొలగించిన ఓట్ల పున:పరిశీలనపై సమీక్షించారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియను బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు 2022 జనవరి ఆరో తేదీ నుంచి ఈ ఏడాది ఆగస్టు తొమ్మిదో తేదీ వరకు వచ్చిన తొలిగింపులను నియోజకవర్గాల ఇఆర్‌ఒలు నూరుశాతం క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నియోజకవర్గానికి నియమించిన ప్రత్యేక అధికారులు ఇఆర్‌ఒలు చేపట్టిన ఓటర్ల తొలగింపు పరిశీలనను తిరిగి పున:పరిశీలించాలని ఆదేశించారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ ఓటు హక్కు తొలగించరాదన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ స్టేషన్లో ఓటు హక్కు ఉందా లేదా చెక్ చేసుకోవాలని, ఏవైనా మార్పులు ఉంటే చేసుకోవాలని సూచించారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియను ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, బిఎల్‌ఒల ద్వారా మానిటర్ చేస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024లో భాగంగా జిల్లాలో ప్రతి నియోజకవర్గం, ప్రతి పోలింగ్ స్టేషన్ వారీగా రీ వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు తాడేపల్లిగూడెం డిఆర్‌ఒ కె.కృష్ణవేణి, ఆచంట టూరిజం ఆర్‌జెడి స్వామి నాయుడు, పాలకొల్లు డిసిఒ ఎం రవికుమార్, నరసాపురం డిఐఒ వి.ఆదిశేషు, ఉండి జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తణుకు జెడ్‌పి సిఇఒ కెవిఎస్‌ఆర్.రవికుమార్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ఎల్.నరసింహరావు, డిటి సన్యాసిరావు పాల్గొన్నారు.

సిఎం జగన్ మహిళాపక్షపాతి : చీఫ్ విప్

ప్రజాశక్తి - మొగల్తూరు

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. గురువారం సాయంత్రం మొగల్తూరులోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నాలుగో విడత వైఎస్ఆర్ సున్నా వడ్డీ కింద 1833 గ్రూపులకు రూ.2.83 కోట్ల చెక్కు నమూనాను స్వయం సహాయక సభ్యులకు గురువారం అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద స్వయం సహాయక గ్రూపు మహిళలకు సున్నా వడ్డీ పథకం అందిస్తున్నామన్నారు. ఈ పథకం జీవనోపాధి అవకాశాలను పెంపొందించడానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రోత్సాహాన్ని అందించడానికి సహాయపడుతుందన్నారు. బ్యాంకు రుణ ఖాతాలు ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘ సభ్యులు వైఎస్ఆర్ సున్నా వడ్డీ పథకం పొందుతున్నారన్నారు. ముందుగా మహిళలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమన బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉప సర్పంచి బోనం నరసింహరావు, కర్రి ఏసుబాబు, మోటుపల్లి రామభాస్కరరావు, పాల రాంబాబు, వెలుగు ఎపిఎం సుభాషిణి పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించి హెల్త్ అసిస్టెంట్ శిరిగినీడి సాయిసూర్యారావుపై ఎఎన్ఎం సంధ్యారాణి ఫిర్యాదు మేరకు నమోదు చేసిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుపై భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్ గురువారం విచారణ చేపట్టారు. ఆరోగ్య కేంద్రం వద్ద ఫిర్యాదు చేసిన ఎఎన్ఎంతో పాటు వైద్యులు సత్యనారాయణరాజు, సిహెచ్‌ఒ దేవదాసు, ఎఎన్ఎంలను, హెల్త్ అసిస్టెంట్లను, ఇతర సిబ్బందిని డిఎస్‌పి విచారించారు. ఇప్పటికే వీరవాసరం ప్రాథమిక కేంద్రంలో చోటు చేసుకున్న పరిణామాలు మండల వ్యాప్తంగా చర్చంశనీయంగా మారాయి. రెండు గ్రూపులుగా విడిపోయిన ఆరోగ్య సిబ్బంది ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం పరిపాటిగా మారింది. వీరి మధ్య నెలకొన్న విభేదాలను పరిష్కరించేందుకు పలు దఫాలుగా ప్రజాప్రతినిధులు సమీక్షలో చర్చలు జరిపినప్పటికీ వారిలో ఎటువంటి మార్పు రాలేదు. దీంతో పరిస్థితులు కేసులు పెట్టుకునే వరకు దారితీశాయి. ఆరోగ్య కేంద్రంలో ఉన్న మండల స్థాయి అధికారుల మెతక వైఖరి వల్లే ప్రస్తుత పరిస్థితి కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి - వీరవాసరం

వరిసాగులో యాజమాన్య పద్ధతులపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని గురువారం కొణితివాడ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు. సర్పంచి భీశెట్టి లక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి భీమవరం సబ్ డివిజనల్ ఎడిఎ చింతల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ వరి సాగులో పాటించాల్సిన నీటి, కలుపు యాజమాన్యపు పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం భీమవరం ఎడిఎ రామలింగేశ్వరావు మాట్లాడుతూ వరి పైరుకు వచ్చే తెగుళ్ల వాటి సస్యరక్షణలపై రైతులకు పలు సూచనలు చేశారు. పాము పొడ తెగుళ్ల నివారణ చర్యలు వివరించారు. ఇ పంట నమోదు చేయించుకున్న రైతులంతా ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. ఎక్కువగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గుతుందని రైతులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, వ్యవసాయాధికారి బిన్నిబాబు, ఉప సర్పంచి శ్రీనివాసరాజు, గ్రామ వ్యవసాయ సహాయకులు మధు, చక్రవర్తి, ఆర్‌బికె ఛైర్మన్, ఎంపిటిసి సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఉండిలో ఎముకలు, కీళ్ల వ్యాధుల పరీక్షా శిబిరం

ప్రజాశక్తి - ఉండి

ప్రస్తుత పరిస్థితుల్లో వయోబేధం లేకుండా చాలా మందికి కీళ్ల వ్యాధులు ఎక్కువగా వస్తున్నట్లు ప్రముఖ వైద్య నిపుణులు శశికాంత్ అన్నారు. ఉండి లయన్స్ ఆడిటరియంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత ఎముకలు, కీళ్ల వ్యాధుల పరీక్షా శిబిరంలో ఆయన పాల్గొని రోగులకు అవగాహన కల్పించారు. ఎముకలు అరిగి పోవటం వల్ల మోకాల నొప్పులు వస్తాయని చెప్పారు. కింద ఎక్కువగా కూర్చోవటం, మెట్లు ఎక్కువ ఎక్కటం చేయకూడదన్నారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు లయన్ వేగేశ్న అనంతలక్ష్మి, లయిన్ కన్నెగంటి రూత్ కళ మాట్లాడుతూ హౌదరాబాద్ స్టార్ ఆసుపత్రి డాక్టర్ శశికాంత్ వచ్చి ఉచిత వైద్య సేవలు అందించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ లయన్ సాగిరాజు సాంబశివరాజు, లయన్లు రుద్రరాజు నరసరాజు, కాగిత మహంకాళి, గాదిరాజు వెంకటేశ్వరరాజు, సత్తి బ్రహ్మరెడ్డి, నంబూరి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పాలకొల్లు మాంటిస్సోరిలో చిన్నారుల ఆకట్టుకున్న వేషధారణలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

శ్రీకృష్ణుడి గీతాసారం అనుసరణీయమని ఉపముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక 23వ వార్డులో అభివృద్ధి పనులతో ఆధునీకరించిన శ్రీకృష్ణుడు చెరువును మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. స్థానిక 6-11 వార్డులు కూడలి ప్రాంతమైన టిటిడి కళ్యాణ మండపం వద్ద మినీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. 33 ఏళ్లుగా తాత్కాలికంగా పందిరి వేసి శ్రీ కృష్ణాష్టమి వేడుకలు చేస్తున్న టిటిడి కళ్యాణ మండపం వద్ద శాశ్వత ప్రాతిపదికన కృష్ణుడి మందిరం నిర్మించుకునేందుకు వంద గజాల స్థలం కేటాయించడంతోపాటు, రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కృష్ణుడు చెరువు వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మంత్రి కొట్టు కొంతసేపు వడ్డన చేశారు. కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులను అభినందించారు. టిటిడి కళ్యాణ మండపం వద్ద వేద పాఠశాల విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో వైసిపి యువ నాయకులు కొట్టు విశాల్, వార్డు ఇన్‌ఛార్జిలు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ పాల్గొన్నారు.

పాలకొల్లు :అహంతో కాకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తే విజయం సాధిస్తామని టిటిడి పాలకవర్గ సభ్యులు మేకా శేషుబాబు అన్నారు. పాలకొల్లు మాంటిస్సోరి స్కూల్, జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శేషుబాబు సతీమణి శశికళ జ్యోతి ప్రజ్వలన చేసి శ్రీకృష్ణునికి పుష్పమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలు తిలకించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించగా, వారు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఉట్టి కొట్టే సన్నివేశాలు తల్లిదండ్రులను, అతిథులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ, ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : కృష్ణాష్టమి వేడుకలను మార్టేరు వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఆ ప్రాంతంలోని చిన్నారులంతా కృష్ణుడి వేషంలో నృత్యం చేస్తూ చుట్టుపక్కల వారిని అలరించారు. ప్రతి గ్రామంలోని వీధుల్లో వేడుకలు నిర్వహించారు. కొన్నిరోజుల నుంచి పిల్లలు సేకరించిన చందాలతో చిన్న కుండీలో పెరుగు, వెన్నతో కలిపి ఉట్టిగా తయారు చేశారు.

తాగునీటి పైపులైను పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని కోలమూరులో మంచినీటి కొరత తీర్చేందుకు రూ.ఐదు లక్షలు మండల పరిషత్ నిధులతో పైపులైన్ నిర్మాణపనులను డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఉండడంతో పైపులైన్ వేసి తాగునీరు అందించేందుకు మండల పరిషత్ నిధులు మంజూరు చేసిన ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, నిర్మాణానికి సహకారం అందిస్తున్న గ్రామ పార్టీ నాయకులు గంద్రాజు రాజేష్‌వర్మకు అభినందనలు తెలిపారు. అనంతరం డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నడింపల్లి సత్యవతి రాంబాబు రాజు, ఎంపిటిసి సభ్యులు పేరిచర్ల అరుణ భార్గవి, గ్రామ పార్టీ అధ్యక్షులు పేరిచర్ల కేశవరాజు, గంద్రాజు రాజేష్ వర్మ పాల్గొన్నారు.

పాలకొల్లులో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

ఇటీవల డిఎస్‌పిగా ఎంపికైన రావూరి అభిషేక్ పాలకొల్లు పెద్ద సాయిబాబా ఆలయంలో గురువారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఇంకా డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, మాజీ సర్పంచి గంటా నరేష్, కొంతేరు శెట్టిబలిజ సంఘం అధ్యక్షులు పెచ్చెట్టి కృష్ణాజీ, పూలపల్లి కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఉనికెల శ్రీనివాస్, జిల్లా ఎస్‌సి ఆర్గనైజింగ్ కార్యదర్శి పాలపర్తి కృపానాథ్, కాపిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

జోడో వార్షికోత్సవ పాదయాత్ర

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పిసిసి పిలుపు మేరకు భారత్ జోడో యాత్ర ప్రారంభమై గురువారంతో సంవత్సరకాలం పూర్తయిన సందర్భంగా తాడేపల్లిగూడెంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మార్నేడు బాబ్జి ఆధ్వర్యంలో జోడో వార్షికోత్సవం పాదయాత్ర నిర్వహించారు. జయలక్ష్మి సెంటర్ నుంచి ఎస్‌విఆర్ సర్కిల్ వరకు ఈ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిటిడి మాజీ ఛైర్మన్ బాపిరాజు, పలువురు నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

CHANGE OF NAME

I undersigned **MASABATTULA SNEHA NAVEEN (Old Name) S/o. Masabattula Satyanarayana,** D.No.12-71/A Salipeta, Undi Post, West Godavari District-534199. Changing My Name from **MASABATTULA SNEHA NAVEEN (Old Name) to S NAVEEN KUMAR MASABATTULA (New Name)** shall hence forth iam being called as **S NAVEEN KUMAR MASABATTULA (New Name)** for all purposes.

CHANGE OF NAME

I undersigned **KAVURU NARSAMMA (Old Name) W/o. Gubbala Ashok Kumar,** D.No.1-74 Modi, L.B.cherla Village, Narsapur, West Godavari District. Changing My Name from **KAVURU NARSAMMA (Old Name) to GUBBALA LAKSHMI KEERTHANA (New Name)** shall hence forth iam being called as **GUBBALA LAKSHMI KEERTHANA (New Name)** for all purposes.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, ప్రగడపల్లి గ్రామ అయిన చాపల సీత అను నేను పోలవరం జిరాక్స్ షాపు నుండి మా ఊరు ప్రగడపల్లి వెళ్తుండగా మార్గమధ్యలో నా పాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెంబర్ **P9990000** కనుక ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరని కోరుచున్నాను.

చాపల సీత
భర్త: పోసి బాబు, ఇంటి నెంబర్ 1-121,
సుబ్రహ్మణ్య స్వామి గుడి వీధి, ప్రగడపల్లి,
పోలవరం మండలం, ఏలూరు జిల్లా,
పిన్ కోడ్: 534318.
సెల్: 77022 28289

ప్రకటన
మహారాజశ్రీ భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప.గో. జిల్లా
M.V.O.P.No. 7 /2023

బిట్వీన్:
మానేపల్లి ప్రభాకర్‌రావు, rep.by మానేపల్లి మురళీకృష్ణ & అదర్స్ .... పిటీషనర్
జంపిన శివ గణేష్ .... రెస్పాండెంట్స్

టు : ఆర్-1 :
జంపిన శివ గణేష్, s/o. వెంకటేశ్వరరావు,
నివాసం : 2-61, ఆర్. పంగిడి గ్రామం,
ద్వారకాతిరుమల మండలం, ప.గో. జిల్లా
డ్రైవర్ ఆఫ్ కార్ నెం. AP39BJ1236
- - -
మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం.7/2023 లో పై తెలిపిన 1వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా వారి కోర్టు వారి యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు సెప్టెంబరు నెల 22 తేదీ 2023వ సం.రం. ఉదయం గం.10-30ని.లకు హాజరు కావలెను. లేని యెడల సదరు విషయమై మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయుదురని ఇందు మూలముగా తెలియ జేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది : 22-09-2023
నిమ్మల వీర వెంకట సత్యనారాయణ
సెల్ : 9848213165,
నిమ్మల నవీన్, సెల్ : 8978122722
అడ్వకేట్స్, భీమవరం